18-06-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM

తెలుగు దినపత్రిక

ప్రభాత

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 261 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి




# గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించండి

- ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- తొలి దశలో నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి

జయభేరి, హైదరాబాద్:

రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సీఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు.
రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని... స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సీఎం సూచించారు.
వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సీఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సీఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నా రాజీనామా కోరే నైతిక హక్కు మీకు లేదు

- బీజేపీపై కర్ణాటక సీఎం ఫైర్



జయభేరి, బెంగళూర్, జూన్ 17:

బీజేపీ తీరుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 4న చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హోంమంత్రి పరమేశ్వర రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఫ్రీడమ్ పార్కులో బీజేపీ ఆందోళనకు దిగడంపై సిద్ధరామయ్య స్పందించారు. తనను రాజీనామా చేయమని డిమాండ్ చేసే నైతిక హక్కు బీజేపీకి లేదని సిద్ధరామయ్య మండిపడ్డారు. మహాకుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మరణించారని, అందుకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేశారా..? అని ఆయన ప్రశ్నించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని అందుకు బాధ్యత వహిస్తూ ఎవరు రాజీనామా చేశారని నిలదీశారు.అంతకుముందు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి 140 మంది మరణించారని, అందుకు బాధ్యత తీసుకుని ఎవరూ రాజీనామా చేయలేదు ఎందుకని సిద్ధరామయ్య ప్రశ్నించారు. అయినా నన్ను నేను రక్షించుకోవడానికి ఈ ఉదాహరణలు చెప్పడంలేదని, రాష్ట్రంలో ఏది జరిగినా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కరెక్టు కాదని అన్నారు.

## రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన పిల్లల చదువుకు హామీ

- కుప్పం మహిళ శిరీషను ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- అన్ని విధాలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని సీఎం భరోసా



జయభేరి, అమరావతి, జూన్ 17 :

చిత్తూరు జిల్లా, కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బంది పెట్టారని ఆమె చెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్ణకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి...అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు ఫోన్‌లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సియం అధికారులను ఆదేశించారు.



## లీడర్ అంటున్న కవిత

### నిశ్చలమైన ధృడసంకల్పం.. భవిష్యత్తుకు.. మార్గ నిర్దేశం

జయభేరి, హైదరాబాద్, జూన్ 17:

బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. `లీడర్` పేరుతో ఆమె యువతకు ఆహ్వానం పలుకుతున్నారు. రాష్ట్ర స్తాయిలో యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా తాజాగా తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి 'లీడర్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిం చారు. ఇప్పటి వరకు లేని ఈ కార్యక్రమానికి యువత నుంచి మహిళల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. అయితే.. ఈ కార్యక్రమం వెనుక చాలా పెద్ద వ్యూహమే కవిత రచించి ఉంటారని తెలుస్తోంది.ప్రస్తుతం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఆమె ప్రారంభించారు. అయితే..త్వరలోనే దీనిని జిల్లాల స్థాయికి కూడా తీసుకువెళ్లనున్నట్టు కవిత చెప్పుకొచ్చారు. ఈ శిక్షణలో భాగంగా ప్రశ్నించే తత్వాన్ని, రాజకీయాలను కూడా యువతకు నేర్పనున్నారు. వాస్తవానికి బీఆర్ ఎస్ తరఫున ఈ కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. కేవలం కవిత నేతృత్వంలోని జాగృతి తరఫునే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో ఆమె బీఆర్ ఎస్ నాయకత్వంపై ఎదురు దాడి చేస్తుండడం.. ఆమె తండ్రి మాజీ సీఎం కేసీఆర్ ను దేవుడు అనడం.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని చెప్పడం తెలిసిందే.ఈ క్రమంలో ఆమె బీఆర్ ఎస్ జెండాను పక్కన పెట్టి జాగృతి పతకాన్ని ధరిస్తుండడం.. కార్యకర్తలు, నాయకులను కలిసినప్పుడు కూడా ఇదే పంథాలో ముందుకు సాగుతుండడం వంటివి ఆమె కొత్త అజెండాకు ఏదో పునాదులు వేస్తున్నారన్న చర్చకు బలాన్నిచేకూరుస్తున్నాయి. అయితే.. దీనిపై స్పష్టత లేకపోయినా.. ప్రస్తుతం చేపట్టిన `లీడర్` కార్యక్రమం ద్వారా తన సైన్యాన్ని ఆమె స్వయంగా తీర్చిదిద్దుకుంటున్నారన్న చర్చ అయితే రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా చేయడం ద్వారా కవిత భవితను రూపొందించుకుంటున్నారని కూడా పరిశీలకులు చెబుతున్నారు. మరి ఇది నిజంగానే ఆమెకు బలాన్ని చేకూరుస్తుందా? లేక.. వ్యూహం ఏంటి? అనేది చూడాలి. ఏదేమైనా.. కవిత ప్రారంభించిన లీడర్ కార్యక్రమం ఏమేరకు సక్సెస్ అవుతుందో కూడా చూడాలి.

## పాకిస్తాన్, ఇరాన్ కకావికలం



జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 17:

ప్రపంచంలో అగ్రదేశాలతో సమానంగా తమ వద్ద కూడా అన్వాయుధాలు ఉండాలని ఇస్లామిక్ దేశాలు కలలు కన్నాయి. అయితే ఇందులో కేవలం మూడు దేశాలు మాత్రమే ఒక అడుగు ముందుకు వేశాయి. కానీ వాటి కలలను అమెరికా, భారత్, ఇజ్రాయెల్ కల్లలు చేశాయి. ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్ దశాబ్దాలుగా అణు శక్తి ఆయుధాల రంగంలో తమ ఆధిపత్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు దేశాల అణు కార్యక్రమాలు వివాదాస్పదంగా, అంతర్జాతీయ ఒత్తిళ్లకు కేంద్రంగా ఉన్నాయి. అయితే, అమెరికా ఇరాక్ అణు కార్యక్రమాలను ఆదిలోనే తుంచేసింది. సద్దాం హుస్సేన్‌ను చంపడంతోపాటు అక్కడి ప్రభుత్వం మార్చడం, అమెరికా సైనిక చర్యలతో ఇరాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. దీంతో అణ్వాయుధం తయారు చేయాలన్న ఇరాక్ కల చెదిరిపోయింది. ఇక ఇటీవలి పరిణామాలు ఇరాక్, పాకిస్తాన్ దేశాల అణు ఆశలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.ఇరాన్ అణు కార్యక్రమం, 2015లో జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. అయితే, 2018లో యునైటెడ్

...మిగతాది 2 లో

## ఛత్తీస్‌గఢ్‌లో దారుణం

రాత్రి 8:30 గంటల వరకు మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదించలేదని తెలిసింది. కానీ, గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అపహరణకు గురైన గ్రామస్తుల ప్రాణాలకు ఏమౌతుందోననే భయంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. రాత్రి సమయం కావటంతో పోలీసు బృందాలు మారుమూల గ్రామానికి వెళ్లే అవకాశం లేదు. ఎందుకంటే ఆకస్మిక దాడి లేదా IED దాడి జరిగే అవకాశం ఉంది.



2 లో

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. పెద్దకోర్మ గ్రామంలో లొంగిపోయిన మావోయిస్టు సభ్యుడు దినేశ్ మొడియం కుటుంబానికి చెందిన ముగ్గురిని మావోయిస్టులు మంగళవారం సాయంత్రం దారుణంగా హత్య చేశారు. మృతులు జింగు మొడియం, సోమ మోడియం, అనిల్ మద్వి అని తెలుస్తోంది. అనంతరం మావోయిస్టులు గ్రామంలోని ఏడుగురిపై దాడి చేశారు. మరో 12 మందిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. స్థానిక ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడం,లొంగిపోయిన మావోయిస్టులతో సంబంధం ఉన్నవారిని శిక్షించడం ఈ దాడి లక్ష్యంగా మావోయిస్టులు భావిస్తున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు. బీజాపూర్ దీనేష్ అత్యంత భయంకరమైన మావోయిస్టుగా పోలీసులు చెబుతున్నారు. అమాయక ప్రజల హత్యకు మావోయిస్టు కమాండర్ వెల్ల, అతని బృందం నాయకత్వం వహించినట్లుగా సమాచారం. హత్యలతో పాటు, మరో ఏడుగురు గ్రామస్తులపై దాడి చేసి గాయపరిచారు. మరో 12 మంది స్థానికులను కిడ్నాప్ చేశారు. వీరి జాడ ఇంకా తెలియలేదు. రాత్రి 8:30 గంటల వరకు మృతుడి కుటుంబ సభ్యులు...

మొదటిపేజీ తరువాయి

## పాకిస్తాన్, ఇరాన్ కకావికలం

స్టేట్స్ ఈ ఒప్పందం నుంచి వైదొలగడం, కఠిన ఆంక్షలు విధించడం వల్ల ఇరాన్ అణు కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఒడంబడికలలో విశ్వాసం కోల్పోవడం వల్ల ఇరాన్ అణు ఆకాంక్షలు దెబ్బతిన్నాయి. ఇటీవలి చర్చలు JCPOA ని పునరుద్ధరించడంలో విఫలమవడం, ఇజ్రాయెల్ నుంచి సైనిక ఒత్తిడి ఇరాన్‌ను మరింత ఇరుకున పెట్టాయిపాకిస్తాన్ 1998లో అణు పరీక్షలు నిర్వహించి, అణు శక్తి దేశంగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, అంతర్జాతీయ ఆంక్షల భయం పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బతీస్తున్నాయి. అణు ఆయుధాల నిర్వహణ, ఆధునీకరణకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడటం, చైనాపై ఆధారపడటం పాకిస్తాన్‌ను ఒక గండిలో పడేసింది. అంతర్జాతీయ సమాజం నుంచి నిరంతర పరిశీలన, భారత్‌తో ఉద్రిక్తతలు ఈ సవాళ్లను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇరాన్, పాకిస్తాన్‌లు అంతర్జాతీయ సమాజం నుంచి విభిన్న ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఆంక్షలు, సైనిక బెదిరింపులు ఉండగా, పాకిస్తాన్‌పై ఆర్థిక సంక్షోభం, ఉగ్రవాద ఆరోపణలు ఒత్తిడి తెస్తున్నాయి. అణు ప్రసార నిరోధక ఒప్పందం వంటి అంతర్జాతీయ చట్రంలో ఈ దేశాలు సమర్థవంతంగా సహకరించలేకపోవడం వాటి అణు కార్యక్రమాలకు అడ్డంకిగా నిలుస్తోంది.ఇరాన్, పాకిస్తాన్ అణు కార్యక్రమాలు విఫలమవడం దక్షిణాసియా, మధ్యప్రాచ్య ప్రాంతాలలో శక్తి సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ విషయంలో, అణు కార్యక్రమం ఆగిపోవడం ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలకు వ్యూహాత్మక ప్రయోజనం కల్పిస్తుంది. పాకిస్తాన్ విషయంలో, అణు ఆయుధాల ఆధునీకరణలో వెనుకబడటం భారత్‌తో రక్షణ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఈ రెండు దేశాలూ తమ అణు ఆకాంక్షలను కొనసాగించాలంటే, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కీలకం.

**పాకిస్థాన్‌ను దెబ్బకొట్టిన భారత్..**

పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా భారత్ చేపిట్టిన ఆపరేషన్ సిందూర్‌తో 9 ఉగ్రస్థావరాలతోపాటు 11 ఎయిర్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. కిరాణా హిల్స్‌లోని పాకిస్థాన్ అణు మానిటరింగ్ సిస్టం దెబ్బతిన్నది. నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై దాడితో అమెరికాకు నష్టం కలిగింది.ఇక ఇజ్రాయెల్ దాడితో ఇప్పుడు ఇరాన్ అణ్వాయుధాలు కూడా దెబ్బతిన్నాయి. కనీసం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. అంటే అణ్వాయుధాలు పునరుద్ధరించుకోవాలంటే మరో 30 ఏళ్లు పడుతుంది. అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ టెహ్రాన్‌తోపాటు అణుస్థావరాలను ధ్వంసం చేసింది. ఆర్థికంగానూ ఇరాన్‌ను దెబ్బతీసింది.ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్‌ల అణు కార్యక్రమాలు రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ దేశాలు తమ అణు ఆకాంక్షలను సాకారం చేసుకోవాలంటే, దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరచడం, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశాల అణు కలలు అంతర్జాతీయ ఒత్తిళ్ల నీడలో కమిలిపోతున్నాయి.

## చత్తీస్‌గఢ్‌లో దారుణం

పోలీసులను సంప్రదించలేదని తెలిసింది. కానీ, గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అపహరణకు గురైన గ్రామస్తుల ప్రాణాలకు ఏమౌతుందోననే భయంతో వారి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. రాత్రి సమయం కావటంతో పోలీసు బృందాలు మారుమూల గ్రామానికి వెళ్లే అవకాశం లేదు. ఎందుకంటే ఆకస్మిక దాడి లేదా IED దాడి జరిగే అవకాశం ఉంది.

# ఏడాది సంబురాల్లో కనిపించని కమలం



**జయభేరి, విజయవాడ, జూన్ 17:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఈ ఏడాది కాలంలో జరిగిన పాలనపై రాష్ట్ర ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రధానంగా ప్రజలను కలుసుకోవడం ప్రజల సంతృప్తిని లెక్క వేసుకోవడం వారికి అనుకూలంగా మళ్లీ కార్యక్రమాలు నిర్వహించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. అయితే కూటమి పార్టీలుగా విజయం దక్కించుకున్న వాటిలో బీజేపీ కీలకమైంది. కేంద్రంలో ఈరోజు మోడీ ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రంలో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం అత్యంత ముఖ్యమైనది. ఇది అందరికీ తెలిసిందే.ఇలాంటి సమయంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరుస్తున్న చంద్రబాబుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలన్నటువంటి ఆలోచన బిజెపికి రాకపోవడం చాలా శోచనీయం. ఎందుకంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఏడాదిపాలనపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నా.. బిజెపి నాయకులు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా తల్లికి వందనం వంటి పథకాన్ని అమలు చేసినప్పుడు కూడా దీనిపై ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమీ పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తికారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికి గత ఎన్నికల్లో విజయం ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమలనాథులు ఏమంటారో చూడాలి.

# టర్కీ కాస్కో.. మోడీ దెబ్బ

**భారత ప్రధాని నరేంద్ర మోదీ కేవలం 10 లక్షల్లోపు జనాభా ఉన్న చిన్న ద్వీప దేశమైన సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. తద్వారా టర్కీకి గట్టి సందేశం పంపించారు. టర్కీ, సైప్రస్ మధ్య దశాబ్దాలుగా వైరం ఉండగా.. సైప్రస్‌కు అండగా నిలవడం వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారత్‌కు ప్రయోజనకరం.**



మధ్యదరా సముద్రంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి.. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సైప్రస్‌తో స్నేహం ఉపయోగపడుతుంది. ఇది భారతదేశానికి ఒక ముఖ్యమైన భాగస్వామిగా మారుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ అనే ఓ చిన్న దేశంలో పర్యటిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను మోదీ ఎక్స్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. మధ్యదరా సముద్రంలో చిన్న ద్వీప దేశమైన సైప్రస్ గురించి మనలో చాలా మందికి తెలియదు. ఆ మాటకొస్తే మన దేశాధినేతలు కూడా సైప్రస్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కానీ ప్రపంచ శక్తిగా ఎదిగే క్రమంలో భారత్.. తనతో కలిసి వచ్చే ప్రతి దేశాన్నీ కలుపుకొని పోతోంది. అయితే సైప్రస్‌తో దోస్తీ మాత్రం అంతకు మించిన కొత్త సమీకరణలకు తెరతీయనుంది.ఎందుకంటే తుర్కియే గుర్తుంది కదా, అదేనండీ టర్కీ . గతంలో టర్కీని భారీ భూకంపం వణికించినప్పుడు ‘ఆపరేషన్ దోస్త్’తో భారత్ అండగా నిలిచింది. కానీ ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు మద్దతు ప్రకటించడంతోపాటు.. మనపై దాడులకు డ్రోన్లను సైతం ఇస్లామాబాద్‌కు అందించింది. ఇప్పుడు టర్కీకి ఓ బలమైన సందేశం ఇవ్వడం కోసం ప్రధాని మోదీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. సైప్రస్ పర్యటనకు వెళ్తే.. టర్కీకి మెసేజ్ ఎలా ఇస్తారని అనుకుంటున్నారా..? అక్కడికే వస్తున్నాం.. టర్కీ, సైప్రస్ రెండింటి మధ్య వైరం ఉంది. 1974లో సైప్రస్ మీద దాడి చేసిన టర్కీ.. ఆ దేశంలో మూడో వంతు భూభాగాన్ని ఆక్రమించుకుంది. అదిగో అప్పటి నుంచి టర్కీ అంటే సైప్రస్‌కు ఏమాత్రం గిట్టదు. అలాంటి సైప్రస్‌కు ప్రధాని మోదీ వెళ్లడం, అది కూడా ఆపరేషన్ సింధూర్ తర్వాత చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇదే కావడం అంటే.. నా శత్రువుతో నువ్వు చెలిమి చేస్తే.. నీ శత్రువుతో నేను దోస్తీ చేస్తానని టర్కీకి బలంగా సంకేతాలు ఇచ్చినట్టే కదా. టర్కీ గనుక తన జోలికొస్తే.. భారత్ తనకు అండగా ఉంటుందనే భరోసా సైప్రస్‌కు దక్కినట్టే.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా, అత్యంత శక్తివంతమైన సైనిక శక్తుల్లో ఒకటిగా ఎదుగుతోన్న భారత్‌తో స్నేహం అనేది సైప్రస్‌కు కొండంత అండ అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్‌తో మరింత సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ఉద్దేశంతో ఉన్న సైప్రస్.. ప్రధాని మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన ‘ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకరియోస్ III’తో సత్కరించి గౌరవించింది.సైప్రస్‌కు మన మద్దతు దొరుకుతుంది. టర్కీ మీద కోపంతో ఆ దేశానికి మద్దతు ఇవ్వడం వల్ల మనకు వచ్చే లాభం ఏంటి అనుకుంటున్నారా? వ్యూహాత్మకంగా, దౌత్యపరంగా, భౌగోళిక రాజకీయ పరంగానే కాకుండా ఆర్థికంగానూ సైప్రస్‌తో దోస్తీ భారత్‌కు ప్రయోజనకరం కానుంది.టర్కీ, సిరియాలకు దగ్గరగా ఉండే సైప్రస్ భౌగోళికంగా ఆసియాలో ఉన్నట్టుగా ఉంటుంది. కానీ ఆ దేశానికి యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో సభ్యత్వం ఉంది. పశ్చిమ దేశాలతో దానికి మంచి సంబంధాలే ఉన్నాయి. అంతే కాదు 2026లో ఈయూ అధ్యక్ష పదవిని చేపట్టనుంది. అంటే యూరోపియన్ దేశాలతో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, మన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సైప్రస్ ఉపయోగపడనుంది. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి కూడా ఈ ద్వీప దేశం మనకు ఉపయోగపడుతుంది.పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదం, కశ్మీర్ అంశంతోపాటు.. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలనే డిమాండ్ విషయంలో సైప్రస్ ఇండియాకు మద్దతునిస్తోంది. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడిని సైతం సైప్రస్ ఖండించింది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఈయూలో లేవనెత్తుతామని ప్రకటించింది.సైప్రస్‌తో స్నేహం చేయడం వల్ల మధ్యదరా సముద్రంలోని కీలక ప్రాంతంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చు. సైప్రస్‌లో ఆర్థిక సేవల రంగం చాలా అభివృద్ధి చెందింది. పన్ను విధానాలు అనుకూలంగా ఉంటాయి. షిప్పింగ్ పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. దీంతో భారత కంపెనీలు యూరప్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఇది అనువైన చోటు అని చెప్పొచ్చు. భారతదేశ వ్యాపారాలకు ఈయూలో గేట్ వేగా సైప్రస్ మారుతుంది. సైప్రస్‌లోని అతిపెద్ద బ్యాంకులలో ఒకటైన యూరో బ్యాంక్, ముంబైలో ఆఫీసును ప్రారంభిస్తామని ప్రకటించింది.భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే విషయంలో సైప్రస్ కీలక పాత్ర పోషించనుంది. రెండు దేశాల మధ్య డబుల్ టాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్ ఉంది. తూర్పు మధ్యధరా ప్రాంతంలోని నిక్షేపాల నుంచి సహజ వాయువును వెలికి తీయడంలో సైప్రస్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. టర్కీ తవ్వకాల కారణంగా ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భవిష్యత్తులో భారత్, సైప్రస్ మధ్య ఎనర్జీ సెక్టార్‌లో భాగస్వామ్యానికి అవకాశం ఉంది. మన సహజవాయువు అవసరాలను తీర్చడానికి సైప్రస్ ఉపయోగపడే అవకాశం ఉంది. భారత్ పశ్చిమాసియా యూరప్ ఎకానమిక్ కారిడార్‌లో సైప్రస్ కీలకమైన భాగం అయ్యే అవకాశం ఉంది. టర్కీ విస్తరణ వాదాన్ని అడ్డుకోవడానికి భారత్ సైప్రస్‌కు ఉపయోగపడితే.. సైప్రస్ ద్వారా మధ్యదరా సముద్ర ప్రాంతంలో భారత్ ప్రాబల్యం పెరుగుతుంది.సైప్రస్‌లోని కొంత భూభాగాన్ని టర్కీ ఆక్రమించిన తర్వాత.. ఉద్రిక్తతలను నివారించడానికి ఐక్యరాజ్య సమితి ‘గ్రీన్ లైన్’ పేరిట బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రీన్ లైన్ ఏరియాను సైతం ప్రధాని మోదీ సందర్శించనున్నారు. తద్వారా టర్కీ విస్తరణ వాదాన్ని ఎత్తి చూపడంతోపాటు.. సైప్రస్‌కు తాము అండగా ఉంటామని స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లు అవుతుంది.ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ లాగే అజర్‌బైజాన్ సైతం పాకిస్థాన్‌కు మద్దుతు ఇచ్చింది. ఆ దేశానికి శత్రుదేశమైన ఆర్మేనియా సైతం భారత్‌తో దోస్తీ కోసం ఆశగా ఎదురు చూస్తోంది. మోదీ త్వరలోనే ఆ దేశంలోనూ పర్యటిస్తారేమో చూడాలి.

> **పశ్చిమ దేశాలతో దానికి మంచి సంబంధాలే ఉన్నాయి. అంతే కాదు 2026లో ఈయూ అధ్యక్ష పదవిని చేపట్టనుంది. అంటే యూరోపియన్ దేశాలతో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, మన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సైప్రస్ ఉపయోగపడనుంది.**

# శభాష్.. సరిత



**జయభేరి, నల్గొండ జూన్ 17:**

ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణించి చరిత్ర సృష్టిస్తున్నారు. తాజాగా.. సరిత అనే తెలంగాణ ఆర్టీసీ తొలి మహిళా బస్ డ్రైవర్‌గా రికార్డు సృష్టించారు. జూన్ 14న డ్యూటీలో చేరిన ఆమె.. మొదటి రోజు హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సు నడిపారు. ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత.. ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు సరికొత్త చరిత్రను లిఖిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ తమదైన ముద్రవేస్తున్నారు. తమ నైపుణ్యాలు, ప్రతిభతో గొప్ప విజయాలు సాధిస్తున్నారు. తాజాగా.. తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా సరిత అనే మహిళ విధుల్లో చేరి రికార్డు సృష్టించింది. డ్యూటీలో చేరిన ఆమె.. మొదటి రోజు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్ నడిపారు. ఇన్నిరోజులు దేశ రాజధాని ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. పురుషాధిక్య రంగంగా భావించే రవాణా రంగంలో సరిత లాంటి మహిళలు అడుగుపెట్టి సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం స్త్రీ సాధికారతకు నిలువెత్తు నిదర్శనం.యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్య తండాకు చెందిన వాంకుడోతు సరిత జీవితం ఎన్నో కష్టాలు, సవాళ్లతో కూడుకున్నది. వాంకుడోతు రాంకోటి, రుక్కా దంపతులకు ఆరుగురు సంతానంలో ఐదో అమ్మాయి సరిత. నలుగురు అక్కల పెళ్లి కోసం తన తండ్రి ఉన్న మూడెకరాల భూమిని అమ్మివేయడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో పదో తరగతి మధ్యలోనే చదువు ఆపేసి తండ్రికి చేదోడు వాదోడుగా నిలిచింది. వేసవి సెలవుల్లో దేవరకొండలోని అక్క ఇంటికి వెళ్లిన సరిత తన బావ వద్ద ఆటో నడపడం నేర్చుకుంది. దురదృష్టవశాత్తు కొన్నాళ్లకే బావ అనారోగ్యంతో మరణించడంతో తల్లిదండ్రులు, తమ్ముడితో పాటు అక్క బాధ్యతను కూడా సరిత తన భుజాలపై వేసుకుంది. దేవరకొండ ప్రాంతంలో ఆటో నడపడం మొదలుపెట్టింది.ఆటో నడుపుతున్నప్పుడు ఆకతాయిల అల్లరి ఎక్కువ కావడంతో సరిత తన ఆహార్యాన్ని మార్చుకుంది. జుట్టు కత్తిరించుకుని, ప్యాంటు, షర్టు ధరించి పురుషుడిలా తయారైంది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ.. ప్రైవేట్‌గా పదో తరగతి పాసై హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందింది. 2010లో నల్లగొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా.. సరిత దరఖాస్తు చేసుకుంది. మహిళల నుంచి వచ్చిన ఏకైక దరఖాస్తు ఆమెదే. అయితే ఆ సమయంలో అధికారులు ఆడవారిని డ్రైవర్లుగా తీసుకోలేమని ఆమె దరఖాస్తును తిరస్కరించారు. అయినా సరిత వెనకడుగు వేయలేదు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసంతో తన కలను నిజం చేసుకోవడానికి మరింత దృఢంగా ప్రయత్నించింది.కొన్ని సంవత్సరాల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల బస్సును కూడా నడిపారు. 2014లో ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా ఎంపికయ్యారు. దేశంలోనే ప్రభుత్వ రంగంలో బస్సు నడిపిన మొదటి మహిళా డ్రైవర్‌గా ఆమె గుర్తింపు పొందారు. ఆమె సరోజిని నగర్ డిపోలో పనిచేస్తూ రోజుకు సుమారు 135 కి.మీ బస్సు నడిపేవారు. ఢిల్లీలో ఆమె సేవలకు మంచి గుర్తింపు లభించింది. ఆమె అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. 2018లో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారం, కిరణ్ బేడీ వంటి ప్రముఖుల చేతుల మీదుగా 'ఉమెన్ అచీవర్స్' అవార్డును అందుకున్నారు.ఢిల్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉండటం, ఖర్చులు ఎక్కువగా ఉండటంతో సరిత తెలంగాణకు తిరిగి రావాలని భావించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి తనకు ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆయన రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లతో మాట్లాడి.. స్పెషల్ రిక్రూట్‌మెంట్ కింద ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

# మళ్లీ ఐ ప్యాక్ టీమ్ తోనే..

**జయభేరి, విజయవాడ:**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరొకసారి ఐప్యాక్ పై ఆధారపడుతున్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. ఈసారి కూడా ఐ ప్యాక్ టీంతో నే ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని తనకు అప్పగించడమే కాకుండా ఎప్పటికప్పుడు నివేదికలను అందించడానికి ఐ ప్యాక్ టీం ను తిరిగి యాక్టివ్ చేయాలని వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు గత ఎన్నికల్లో పనిచేసిన వారిని ఈసారి కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోసారి సర్వేలకు రెడీ అవ్వాలని ఐ ప్యాక్ టీంను ఆదేశించినట్లు తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఐప్యాక్ కార్యాలయాన్ని కూడా తీసి వేశారు. అయితే తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. జనంలో మంచి ఊపు ఉందని, అయితే ఫీల్డ్ లెవెల్ లో తనకు ఖచ్చితమైన సమాచారం తెలియాలంటే ఐ ప్యాక్ టీం అవసరాన్ని గుర్తించిన జగన్ మరోసారి దానిని రంగంలోకి దించాలని నిర్ణయించారని తెలిసింది. త్వరలోనే ఐ ప్యాక్ టీం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో కార్యక్రమాలను ప్రారంభిస్తుందని కూడా పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు 2019లో అధికారాన్ని తెచ్చిపెట్టిన ఐ ప్యాక్ సంస్థ మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత దుకాణం మూసివేసింది. ఈ సంస్థ బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ దే అయినప్పటికీ ఆయన 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన బీహార్ రాజకీయాలకు పరిమితమయ్యారు. దీంతో ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారు దానిని నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికలకు కూడా వైఎస్ జగన్ మరోసారి గెలిచేందుకు ఐప్యాక్ సంస్థను కొనసాగించారు. ఐప్యాక్ సంస్థకు రుషిరాజ్ నేతృత్వం వహించారువారి ఖాతాల్లో మరికొంత నగదు మళ్లీ రుషిరాజ్ నేతృత్వంలోనే? తిరిగి రుషిరాజ్ నేతృత్వంలోనే ఐ ప్యాక్ సంస్థ పనిచేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. జనాభా గణన మొదలు కానుండటంతో పాటు 2027లో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంతో జమిలి ఎన్నికల నేపథ్యంలో ఐ ప్యాక్ ను త్వరగానే రంగంలోకి దించాలని వైఎస్ జగన్ భావిస్తున్నార. ఎప్పటి లాగానే ఐ ప్యాక్ సంస్థ అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ, సోషల్ మీడియాలో ప్రచారం వరకూ అంతా తానే చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఒక్కోసారి వైఫల్యాలు ఉంటాయని, అది జనం మనసులను అంచనా వేయడంలో తప్పు అయినా, దాని అవసరం తమకు ఉందని గుర్తించిన జగన్ తిరిగి ఐ ప్యాక్ ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది.

# సూపర్ సిక్స్ పేరుతో ఏడాది పాలన అంతా మోసమే

- హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాలు ఆగవు
- జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో
- మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల స్థానిక వై.సి.పి పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు ఆధ్వర్యంలో సీ.ఎం చంద్రబాబు ఏడాది పాలనపై పార్టీ రూపొందించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ముఖ్యఅతిధులు గా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్,రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు , జడ్పీటీసీ పైల సన్యాసిరాజు పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు .ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్ సిక్స్ తో పాటు 180కి పైగా హామీలిచ్చి ప్రజలను అన్ని విధాలా మోసం చేశారని అన్నారు. కూటమి ఏడాది పాలలో అభివృద్ధి చేయకపోగా,వారు చేసిన మోసాలను,అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు.కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమేనని ధ్వజమెత్తారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేశారని,దీనికి సంబంధించిన వాస్తవాలు ,ఆధారాలతో ఈ పుస్తకం రూపొందిందని చెప్పారు. మోసపు హామీలు, అబద్ధపు మాటలతో మభ్యపెట్టి రాష్ట్ర ప్రజలకు ఏవిధంగా వెన్నుపోటు పొడి చారో ఈ పుస్తకంలో వివరించారని తెలిపారు.మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అంటున్నారని, దీనిలో చంద్రబాబు ఎన్ని మతలబులు పెడతారో వేచి చూడాలని అన్నారు. గత ఏడాది ఎగ్గొట్టిన తల్లికి వందనం, రైతు భరోసా వంటివి కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.లేకుంటే ప్రజల తరపున పోరాడతామని చెప్పారు. ఈ యొక్క కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ చుక్క రాము నాయుడు, పెందుర్తి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నెల సన్యాసిరావు, వెన్నెల పాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, కలపాక సర్పంచ్ బోండా కనకరావు, నాయుడు పాలెం సర్పంచ్ కుంద్రపు వరలక్ష్మి సీతారామయ్య, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రవణ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు మాజీ ఎంపీటీసీ కావలి రాజు, వై.సి.పి నాయకులు పైల సత్యనారాయణ (బొబ్బిలి), కావలి వాసు,మడక సూరిబాబు ,డెక్క శ్రీనివాసరావు, కుంద్రపు కృష్ణం నాయుడు, SC సెల్ అధ్యక్షుడు ఈదలపాక సన్యాసిరావు ఉమ మహేశ్వరి, పాశిల ధివ్య కీర్తన, వినోద్, జగదీష్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## RK సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వరల్డ్ కరాటే డే

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్థానిక బాలుర జూనియర్ కాలేజ్ ఆవరణంలో JKA దేవరకొండ కరాటే అసోసియేషన్ మాస్టర్ చిత్తనూరి శ్రీనివాస్ నిర్వహించిన ఇంటర్నేషనల్ వరల్డ్ కరాటే డే ను RK సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ చిత్తనూరి శ్రీనివాస్ మాట్లాడుతూ RK సేవా ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి, కరాటే వలన ప్రతి ఒక్కరికి వారి శరీరం పై శ్రద్ధ, ఏకగ్రత, నిబద్దత, క్రమశిక్షణ తో కూడిన జీవితం అవాలంభిస్తారని, కరాటే ను ప్రతి ఒక్క తల్లితండ్రులు వారి పిల్లలకు విధిగా నేర్పలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో RK సేవా ఫౌండేషన్ అధ్యక్షులు పున్న రామకృష్ణ మాట్లాడుతూ చిన్న పిల్లల ముందు ఇలా కేక్ కట్ చేయడం వారికీ ఉన్న ఉత్సాహం చూస్తుంటే ముచ్చటే స్తుందని మాస్టర్ శ్రీనివాస్ ను ప్రశంసించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప అధ్యక్షులు ఎండీ అన్వార్, జానకిరామ్, శివ,ఎండీ మాకబుల్,గుండాల వెంకట్ యాదవ్, శివ, PET శ్రీను,డాన్స్ మాస్టర్ జగన్, టీ ప్రతాప్ ,లింగం, మాస్టర్స్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పేదింటి కల నెరవేరింది




**జయభేరి, తుర్కపల్లి, జూన్ 17 :**

ఇందిరమ్మ పేదింటి కల నెరవేరిందని ఓ బి సి జిల్లా కోఆర్డినేటర్ దేవరూప్పల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారుల ఇంటి వద్ద మగ్గు పోశారు। ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, గ్రామ శాఖ అధ్యక్షుడు దేవరూప్పల మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ ఎరుకల వెంకటేష్ గౌడ్, ధ్యాన బోయిన మల్లేష్ ధ్యాన బోయిన బొందయ్య, దేవరుప్పల బాలయ్య, ధ్యాన బోయిన కరుణాకర్, ప్రవీణ్, కరోబార్ ఎరుకల స్వామి గౌడ్ పాల్గొన్నారు.



## పరవాడ మండల నూతన వ్యవసాయ అధికారిణిగా రమాదేవి

**జయభేరి, పరవాడ :**

పరవాడ మండల నూతన వ్యవసాయ అధికారిణిగా మొల్లి రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో చోడవరం డివిజనల్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తించి ఇటీవలే జరిగిన సాధారణ బదిలీలో భాగంగా పరవాడ విచ్చేసారు.ఇప్పటివరకు ఇక్కడ వ్యవసాయ అధికారినిగా విధులు నిర్వర్తించిన చంద్రావతి పెందుర్తి వ్యవసాయ అధికారినిగా బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కోసం ప్రభుత్వం ఈ కేవైసీ చేయమని సూచించడం జరిగిందన్నారు. ఇప్పటికే పలు పథకాలు కోసం చేయించుకున్న ఈకేవైసీని అన్నదాత సుఖీభవ పథకం కోసం వేస్తున్న ఈ కేవైసీ తో జత చేయడం జరుగుతుందన్నారు.ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోలేని రైతు వేలి ముద్ర ద్వారా ఈ కేవైసీ ప్రక్రియ జరుగుతుందిఅన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ పరవాడ మండల వ్యవసాయ ఆఫీసు నందు జరుగుతుందిఅని రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిఈసి గ్రూపును దేవరకొండకు ఇవ్వాలని వినతి పత్రం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో ని ఆర్డీవో ఆఫీసులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డి ఎ ఓ సరోజా పవన్ కలిసి బీసీ గురుకులాలో మార్చిన సి ఈ సి గ్రూపును దేవరకొండకు ఇవ్వాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలురు కొలుముంతలపాడు, కొండమల్లేపల్లి బాలికల పాఠశాలలో ఉన్నటువంటి సి ఈ సి గ్రూపుని ఇక్కడి నుంచి నార్కెట్ పల్లి కి మార్చడం సరి కాదన్నారు. ఈ ప్రాంతం వెనుకబడిన ప్రాంతం సి ఈ సి గ్రూపుని మార్చడం వల్ల పేద విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉన్నది తక్షణమే జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ,ఆర్ సి ఓ, నల్గొండ వారు ఆలోచన చేసి ఉన్నటువంటి సి ఈసి గ్రూపును దేవరకొండ గురుకులాలకు మార్చాలి మార్చని యెడల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసి మా గురుకులాలకు మా గ్రూపుని విద్యార్థుల ఉన్నంత విద్య కోసం పేద విద్యార్థుల అభ్యున్నత కోసం పోరాటం చేసి సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పం వీరయ్య, పున్న వెంకటేష్‌నేత, తూటుపల్లి శ్రీను, లౌడియ భాషా నాయక్, కడ్తాల బాలస్వామి, మాకం చంద్రమౌళి (సీఎం), గడ్డం బిక్షమయ్య, గండూరు లక్ష్మణ్, కానుగుల మధు, మేదరి సంఘం వెంకటయ్య, కొలుకులా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల వాసాలమర్రికి మంత్రి రాక

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 17 :**

ఈనెల 19న తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు తెలిపారు. మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో సమావేశ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసాలమర్రి గ్రామానికి 227 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసిల్దార్ దేశ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు.. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి




**జయభేరి, తుర్కపల్లి, జూన్ 17 :**

మండలంలో అర్హులైనటువంటి పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల మహాసభను నాగపురి నరసింహ వసంతల అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల్లోకి అడిగి పెడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాటి నుండి నేటి వరకు ప్రజల ప్రక్షాళన నిలబడి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్పోరేట్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. అర్హులందరికీ పథకాలు అమలు చేయడానికి సిపిఐ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. అనంతరం మండల కార్యదర్శిగా సిల్వేరు దుర్గయ్యను, సహాయ కార్యదర్శిగా గుంటుపల్లి సత్తయ్యను ,16 మంది మండల కౌన్సిల్ సభ్యులు, 9 మంది మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు గ్రామాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యుడు కల్లెం కృష్ణ, మహిళా సామాజిక జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సంజమ్మ, మండల కార్యదర్శి సిల్వర్ దుర్గయ్య, నాయకులు గుంటుపల్లి సత్తయ్య, వల్లభ భగవంతు, పూరుమాని వసంత, కొండ అంజమ్మ పాల్గొన్నారు.


## గుడిపల్లి మండల అధ్యక్షులుగా బోడ నాగరాజు నియామకం



**జయభేరి, గుడిపల్లి :**

తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ యువజన సంఘం 1033/77 దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ ఎర్ర ఆంజనేయులు గుడిపల్లి మండల అధ్యక్షులుగా బోడ నాగరాజు కి నియమాక పత్రాలను అందించారు. దేవరకొండ నియోజకవర్గంలో అంబేద్కర్ యువజన సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోడ నాగరాజు మాట్లాడుతూ గుడిపల్లి మండలంలోని గ్రామ శాఖ అధ్యక్షులను నియమించి సంఘాన్ని బలోపేతం చేసి అంబేద్కర్ భావజాలంతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చందంపేట మండల అధ్యక్షులు నాగిళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ రింగరోడ్డుకు మహర్ధశ



**జయభేరి, హైదరాబాద్, జూన్ 17:**

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టుని నిర్మిస్తున్నారు. అయితే ఉత్తర భాగం పనుల టెండర్లపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. బిడ్లు సమర్పించడానికి జూన్ 18 వరకు మాత్రమే గడువు ఉండగా.. 19న టెండర్లను తెరవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబరు 27న భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల కోసం ఐదు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. కానీ ఆరు నెలలుగా ప్రతి నెలా టెండర్ల గడువును పొడిగిస్తూ వస్తోందిఇక ఉత్తర భాగాన్ని ముందుగా నాలుగు వరుసల రహదారిగా నిర్మించాలనుకున్నా.. ఆరు వరుసల రహదారిగా విస్తరించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే ఆరు వరుసల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం నుండి ఇంకా ఆమోదం లభించలేదు.

ఆరు వరుసల రహదారికి మార్చాల్సి వస్తే.. ఎన్‌హెచ్ఏఐ మళ్లీ టెండర్లను పిలవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే ట్రాఫిక్ సర్వేతో పాటు మరోసారి డీపీఆర్‌పై అధ్యయనం చేసింది. రెండు రోజుల్లో బిడ్ల దాఖలు గడువు ముగియనుండటంతో ఎన్‌హెచ్ఏఐ గడువును మళ్లీ పొడిగిస్తుందా? లేక కొత్త ప్యాకేజీలతో ఆరు వరుసల రహదారికి టెండర్లను పిలుస్తుందా? అనే సందిగ్ధత కొనసాగుతోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులను వేగవంతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇవాళ మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఆర్ఆర్ఆర్ పనులపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగం పనులను కూడా చేపట్టాలని కేంద్రాన్ని తరచుగా కోరుతోంది. ఒకవేళ కేంద్రం ఆమోదించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఈ పనులను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు విషయానికొస్తే.. మొత్తం పొడవు సుమారు 340 కిలోమీటర్లు. ఉత్తర భాగం సుమారు 161 కిలోమీటర్లు (సంగారెడ్డి నర్సాపూర్ తూప్రాన్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ యాదాద్రి భువనగిరి చౌటుప్పల్) వరకు దక్షిణ భాగం పనులు సుమారు 182 కిలోమీటర్లు (చౌటుప్పల్ శివన్నగూడెం కందుకూరు ఆమన్‌గల్ చేవెళ్ల శంకర్‌పల్లి సంగారెడ్డి) వరకు నిర్మించనున్నారు. మొత్తం ప్రాజెక్టుకు సుమారు రూ.17 వేల కోట్ల నుంచి రూ.21 వేల కోట్లు. 2026 నాటికి ఉత్తర భాగం, 20272028 నాటికి దక్షిణ భాగం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరం చుట్టూ కనెక్టివిటీ మెరుగుపడి, ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. అంతేకాకుండా హైదరాబాద్ చుట్టూ స్థిరాస్తి రంగం పుంజుకుంటుంది.

## ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకొని ఆలయంలో పూజలు



**జయభేరి, కోదాడ:**

కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదినం పురస్కరించుకొని అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ లు వెంపటి వెంకటేశ్వరరావు రూపా గ్రామంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులను చేపట్టాలని స్వామివారిని కోరుకున్నట్లుగా ఆయన తెలిపారు.అవినీతి మరకలేని మహా నాయకురాలు పద్మావతి రెడ్డి అని ఆమె సారథ్యంలో పార్టీ కోసం పని చేయటం ఆనందంగా ఉన్నదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## గుర్తు తెలియని శవం

**జయభేరి, రాయచోటి:**

రాయచోటి పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి లో అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని శవం ఉన్నట్లు మంగళవారం ఉదయం పోలీసులు గుర్తించారు. తల, ముఖం, చేతి పై రక్త గాయాలు ఉన్నాయన్నారు. ఇక్కడ చంపారా లేదా బయట చంపే ఇక్కడికి తీసుకొచ్చి పడేసారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పంచనామా నిమిత్తం బాడీని మార్చురీకి వైద్య సిబ్బంది తరలించారు.



## జోనల్ కమిషనర్ ని మర్యాద పూర్వకంగా ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని మర్యాద పూర్వకంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి చర్లపల్లి డివిజన్ లో పర్యటించినప్పుడు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అలాగే వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచుకొని వివిధ కాలనీ లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

## కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షామీర్ పేట్ లోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ని కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి తదితరులు కలిసి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో BRS పార్టీ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్, నాయకులు మల్లం వెంకటేష్ గౌడ్, నాగిరెడ్డి, సాయి, లోకేష్, బిక్కు మాత్రే తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వం ఉద్దేశ్యం

- అనాజ్ పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు... పాఠ్య పుస్తకాలు పంపిణీ.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులకు మరింత మహర్దశ రానుంది.
- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి



**జయభేరి, అబ్దుల్లాపూర్ మెట్, జూన్ 17:**

అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్ పూర్ గ్రామంలో ఉన్న ప్రైమరీ పాఠశాల.. ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రోజున ఉపాధ్యాయుల ఆహ్వానం మేరకు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులు... పాఠ్య పుస్తకాలను అందచేయడం జరిగింది.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సూరిబాబు తో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు..స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**జయభేరి, మేడిపల్లి, జూన్ 17:**

మేడ్చల్ నియోజకవర్గంలో నేడు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మాజీ మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి లబ్ధిదారులకు చెక్కులను ప్రదానం చేశారు. మాజీ మేయర్ అమర్ సింగ్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ప్రాముఖ్యతను వారు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మండలాల ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది.

# షాద్ నగర్ లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

- బిఆర్ఎస్ హయాంలోనే ఫోన్ ట్యాపింగ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ చేసి శిక్షించాలని డిమాండ్..
- విచారణ చేయని పక్షంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ లోపాయికరి ఒప్పందం చేసుకున్నారనే అనుకోవాల్సి ఉంటుంది
- చట్టం నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



**జయభేరి, షాద్ నగర్, జూన్ 17 :**

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కుంబకోణం షాద్ నగర్ కు చెందిన బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డికి తాకింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చాలా మంది ముఖ్య నాయకుల ఫోన్ లు ట్యాపింగ్ అయిన విషయం అందరికి తెలిసిన విషయమే. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో బిజెపి ముఖ్య నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్ కు గురైంది. షాద్ నగర్ బిజెపి కార్యాలయం లో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా మీడియా సమావేశంలో పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లో ముఖ్యమైన 6 హక్కులలో వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు ఒకటని దానిని హరించడం ఎవ్వరికి హక్కు లేదని తెలిపారు. గత ప్రభుత్వం నా ఫోన్ ట్యాపింగ్ చేసిందని నాతో పాటు నేను మాట్లాడిన 50 వేల మంది వ్యక్తిగత గోప్యత ను హరించిందని అన్నారు. ఇది చాలా అన్యాయం అని దీని వల్ల సాధించింది ఏందీ ప్రజలు మిమ్మల్నే ఇంట్లో కూర్చోబెట్టే టట్టు చేసింది. నాతో పాటు చాలా మంది ముఖ్య నాయకుల ఫోన్ లు కూడా చేశారని సొంత పార్టీ వారి ఫోన్ లు కూడా ట్యాపింగ్ చేశారాని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై విచారణ చేపట్టి ఇందుకు కారణమైన వారిని శిక్షించాలని కోరారు. ఆలా చేయని పక్షం లో కాంగ్రెస్, బిఆర్ఎస్ లోపాయికరి ఒప్పందం చేసుకొని ఇదంతా చేసినట్టు అర్థం చేసుకోవాల్సి వస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఇంతటితో వదిలిపెట్టేది లేదని హైకోర్టుకు కూడా వెళ్తామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల వాళ్ళకి ఒరిగిందేమీ లేదని వాళ్ళు తోడుకున్న గుంతలో వాల్లే పడ్డారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మోహన్ సింగ్, లస్కర్ నాయక్, మహేందర్ రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, బాల్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఐమాక్స్ లైట్లు మంజూరు చేయాలి

**జయభేరి, ఎల్బీనగర్, జూన్ 17:**



కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్, ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి మంగళవారం నగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఎల్బీనగర్ నుంచి అల్కాపురి జంక్షన్ వరకు వేస్తున్నటువంటి స్ట్రామ్ వాటర్ పైప్ లైన్లను నాగోల్ మూసి లోకి త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం జోనల్ కమిషనర్ 25 కోట్ల రూపాయల అంచనతో మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ కి కోరడంతో వారు వెంటనే స్పందించి శాంక్షన్ చేయడం జరిగింది. పైపు లైన్ పనులు త్వరగ పూర్తి చేయిస్తామని కార్పొరేటర్లకు తెలియజేయడం జరిగింది. గాయత్రి పురం నుంచి రామలింగేశ్వర కాలనీ వరకు స్ట్రాం వాటర్ బాక్స్ డ్రైనేజ్ కొరకు 6 కోట్ల రూపాయలు శాంక్షన్ చేయించడం జరిగింది. దానికి జోనల్ కమిషనర్ మరల టెండర్ వేయించడం జరిగిందనీ తెలియజేశారు. అనంతరం కొత్తపేట కార్పొరేటర్ కొత్తపేట డివిజన్ పరిధిలో సమస్యలపై వివరించి వినతి పత్రాన్ని అందజేసారు, న్యూమారుతి నగర్, ఓల్డ్ మారుతి నగర్, కొత్తపేట విలేజ్, బృందావన్ కాలనీలో రోడ్లన్నీ పడిపోయాయని నూతన సీసీ రోడ్డులను మంజూరు చేయాలని కోరారు. కొత్తపేట డివిజన్లో నూతనంగా 23 ఐమాక్స్ లైట్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్ ని కోరగా మంగళవారం నూతన ఐమాక్స్ లైట్లు మంజూరు చేయడం జరిగింది, త్వరలోనే ఐమాక్స్ లైట్లను కాలనీలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు.



## తల్లికి వందనం పథకం చిరుద్యోగులకు వర్తింప చేయాలి


- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నెలకు రూ. 25 వేల లోపు ఆదాయం ఉండే వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించి నేడు అమలు చేయకపోవడం అన్యాయమని వెంటనే చిరుద్యోగులు కూడా తల్లికి వందనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా తల్లికి వందనం అమలు చేస్తున్నామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం అనేక మంది తల్లులకు అకౌంట్లో రూ 13 వేలు చొప్పున వేశారు. ఈ జీవోలో పారిశుధ్య కార్మికులకు ఇస్తామని చెప్పినప్పటికీ ట్రక్ ఓపెన్ కావడం లేదు. అతి తక్కువ ఆదాయం వస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు, పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో వారికి అమలు చేయడం లేదు. కేవలం సి ఎఫ్ ఎం ఎస్ లు వేతనాలు తీసుకున్నంత మాత్రాన ప్రభుత్వ ఉద్యోగులు కాదు. వీరిలో అనేకమందికి 10000 కంటే తక్కువ వేతనం వచ్చే వారే అని ప్రభుత్వం గ్రహించాలి గని శెట్టి అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రూ 25000 ఆదాయం వస్తున్నాయి. అంగన్వాడి వర్కర్లకు రూ 11,500, హెల్పర్లకు 7000. ఆశాలకు రూ 10,000 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి గ్రామాల్లో రూ 20000, పట్నాలలో నెలకు 25000 లోపు ఆదాయం వచ్చే వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

# తల్లి కూతుల్ల మిస్సింగ్

**జయభేరి, హయత్ నగర్, జూన్ 17:**



పెద్ద అంబర్ పేట, సాయి నగర్ కాలనీకి చెందిన తుమ్మలపల్లి రవీందర్ రెడ్డికి మానసతో 20 సంవత్సరాల క్రితం వివాహం అయినది. వారికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సుశ్రుత(18), చిన్న కూతురు తేజస్వి(16). తుమ్మలపల్లి రవీందర్ రెడ్డి నెల రోజుల క్రితం తిరుమలగిరి సూర్యాపేట జిల్లాకి వెళ్ళినాడు. 10 రోజుల తర్వాత తన భార్యకి ఫోన్ చేసి వేసవికాలం సెలవులు కదా పిల్లలని తీసుకొని వాళ్ళ సొంత ఊరు అయిన రేవల్లి, నాంపల్లి మండలం, నల్గొండ కి వెళ్ళమనగా మనస పోను అని వారించిందిదాంతో రవీందర్ రెడ్డికి కోపం వచ్చి డబ్బులు పంపడం ఆపేశారు. రవీందర్ రెడ్డి తేది 11.06.2025 నాడు ఇంటికి వస్తున్నాను అని మానసకి చెప్పి తేదీ 11.06.2025 నాడు మధ్యాహ్నం 02:00 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. మానస, ఇద్దరు కూతుళ్ళ గురించి ఇంటి యజమానిని అడగగా వాళ్ళు బట్టలు సర్దుకుని వెళ్లినారని తెలిపినాడు. వాళ్ళ గురించి ఇప్పటివరకు వస్తారేమో అని ఎదురు చూసి చుట్టుపక్కల ప్రాంతాలలో, బంధువుల దగ్గర వెతికిన ఎటువంటి ఆచూకీ లభించకపోవడం కనిపించకుండపోయిన తన భార్య పిల్లలను వెతికి పెట్టవలసిందిగా ఫిర్యాదు చేయనైనది.

## రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీకి దొరికిన ఏఈ



**జయభేరి, కాప్రా, జూన్ 17:**

జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయంలో రామ్ రెడ్డి అనే కాంట్రాక్టర్ నుంచి లక్ష 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
లంచం తీసుకుంటూ పట్టుబడిన చర్లపల్లి ఏఈ స్వరూప సదరు కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించడానికి లక్ష 20 వేల రూపాయలు ఇవ్వాలని కాంట్రాక్టర్ ను ఒత్తిడి చేయడంతో కాప్రా మున్సిపల్ కార్యాలయం గేటు దాటేలోపు ఏ ఈ స్వరూప ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని లక్ష 20 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఏ ఈ స్వరూప పై కాంట్రాక్టర్లను లంచాల కోసం వేధింపులకు గురి చేసిందని ఆరోపణలు ఉన్నాయి.

# లూకాస్ ప్రమాణ స్వీకారం

**జయభేరి, ఉప్పల్, జూన్ 17:**




ఉప్పల్ డివిజన్‌లోని లక్ష్మీనారాయణకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లూకాస్ మరోసారి ఎన్నికయ్యారు. దీంతో పాటు కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్‌గా మధుబాబు ఎన్నికయ్యారు.
వీరిద్దరి ప్రమాణ స్వీకారానికి పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పసల లూకాస్ , గౌరవ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, చీఫ్ అడ్వైజర్ నాగేశ్వరరావు, చైర్మన్ మధు బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రవీందర్, ఉపాధ్యక్షుడు మదల్ వల్లి, సునీల్, అడ్వైజర్లు అశోక్ గౌడ్, నిరంజన్, శ్రీను, ఎస్.కె మదర్, సంజీవ యాదవ్,
సంయుక్త కార్యదర్శి, భాస్కర్ దాస్, మురళి రెడ్డి, నరసింహ చారి, డీజే నాగేష్, చాంద్ భాష, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పూర్ణచంద్రారెడ్డి, బీ రఘు, బాలు, ఇస్మాయిల్, సతీష్, టెంపుల్ వైస్ చైర్మన్, నాగరాజు, పరమేష్, సుధాకర్, ట్రెజరర్ ఆర్టీసీ వేణు, లీగల్ అడ్వైజర్ సత్యనారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఇతరులు పాల్గొన్నారు.



## ఇలియానా రెండో బిడ్డకు జన్మనిచ్చిందా..


గోవా బ్యూటీ ఇలియానా అందం, అభినయం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ బ్యూటీ టాలీవుడ్‌లో స్టార్ హీరోలతో కలిసి నటించి మంచి పేరు తెచ్చుకుంది. స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఆ తర్వాత బాలీవుడ్‌కి వెళ్లి చేతులు కాల్చుకుంది. ఇక చేసేదేం లేక మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని పెళ్లాడింది..ఇతను పోర్చ్‌గీసుకి చెందిన వ్యాపార వేత్త కాగా, అతనితో కొన్నాళ్లపాటు డేటింగ్ లో ఉండి ఆ తర్వాత వివాహం చేసుకొన్నారు. ప్రస్తుతం ఆమె పోర్చుగీస్ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. డోలన్‌తో పెళ్లి తర్వాత ఈ జంటకి ఆగస్టు 2023 సంవత్సరంలో కొడుకు పుట్టాడు. ఇలియానా డోలన్‌కి ముందు ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫర్ ఆండ్రూ నీబోన్‌తో సుదీర్ఘ కాలంగా అఫైర్ కొనసాగించింది. అయితే వారిద్దరూ 2019 లో అభిప్రాయ బేధాల కారణంగా బ్రేకప్ చెప్పుకొన్నారు. ప్రస్తుతం మైఖేల్ డోలన్‌తో ఇలియానా సంతోషంగానే ఉంది. అయితే ఇటీవల కాలంలో ఆమె రెండోసారి గర్భం దాల్చిందనే వార్తలు వినిపించాయి. గత ఏడాది అక్టోబర్‌లో సెకండ్ ప్రగ్నెన్సీ విషయాన్ని తెలియజేసింది ఇలియానా. అయితే రీసెంట్‌గా ఆమె పండంటి బిడ్డకి జన్మనిచ్చినట్టు తెలుస్తుంది. ఫాదర్స్ డే రోజున ఇలియానా రెండో బిడ్డకు జన్మనిచ్చింది అని అంటున్నారు. అందుకు కారణం ఈ అమ్మడు తన సోషల్ మీడియాలో చిన్నారిని డోలన్ ముద్దాడుతున్న ఫోటోను షేర్ చేసింది. అది చూసి ఆ బిడ్డ అప్పుడే పుట్టినట్టుగా కనిపిస్తుందని, వారి బిడ్డే అని అంటున్నారు. అయితే తమకు పుట్టిన బిడ్డ ఆడ పిల్లనా? మగ పిల్లాడా? అనే విషయాన్ని మాత్రం సీక్రెట్‌గా ఉంచారు. మరి ఈ విషయంపై పూర్తి క్లారిటీ ఎప్పుడు ఇస్తుందో చూడాలి. ఇక ఇలియానా కెరీర్ విషయానికి వస్తే.. దేవదాస్ సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె.. ఆ సినిమా హిట్ కావడంతో మంచి ఆఫర్స్ అందిపుచ్చుకుంది. తెలుగులోనే కాక తమిళం, హిందీ భాషల్లో బిజీగా మారిపోయింది. చివరిగా దో ఔర్ దో ప్యార్ అనే చిత్రంలో కనిపించింది ఇలియానా. కాగా, ప్రెగ్నెన్సీ కారణంగా పలు సినిమాలను వదులుకుంది ఇలియానా. అందులో అజయ్ దేవగన్‌తో కలిసి నటించాల్సిన రైడ్ 2 సినిమా ఒకటి. ఈ సినిమా కోసం ఆమెమెకు భారీ ఆఫర్ ఇచ్చారు. కానీ ప్రెగ్నెన్సీ వలన ఆ మూవీని వదులుకున్నదనే వార్తలు నెట్టింట హల్‌చల్ చేశాయి.

## థగ్‌లైఫ్ కర్ణాటక రిలీజ్‌కు సుప్రీం గ్రీన్‌సిగ్నల్



'థగ్‌లైఫ్' చిత్రాన్ని కర్ణాటకలో విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామనే బెదిరింపులు చట్టవిరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ సినిమా విషయంలో కన్నడ సంఘాల దౌర్జన్యపూరిత వైఖరిని సుప్రీం తప్పుబట్టింది. థియేటర్లలో ఏ చిత్రాలను ప్రదర్శించాలో నిర్ణయించే అధికారం ఆయా సంఘాలకు లేదని స్పష్టం చేసింది.

చిత్ర కథానాయకుడు కమల్‌హాసన్ కన్నడ భాషపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో 'థగ్‌లైఫ్' రిలీజ్‌ను అడ్డుకుంటామని కన్నడ రక్షణ వేదికతో పాటు పలు ప్రజా సంఘాలు హెచ్చరించాయి. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ సైతం విడుదలను ఆపివేస్తున్నట్లు ప్రకటించింది. కర్ణాటక హైకోర్టులో కమల్‌హాసన్‌కు వ్యతిరేకంగా తీర్పురావడంతో చిత్ర బృందం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం.. బెదిరింపుల ఆధారంగా చిత్రాన్ని అడ్డుకోవద్దని స్పష్టం చేసింది. కమల్‌హాసన్ కన్నడ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్న కర్ణాటక హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీం ప్రశ్నించింది. 'ఎవరైనా వ్యాఖ్యలు చేసినప్పుడు దానిని మరో మాటతో కౌంటర్ చేసే స్వేచ్ఛ తీసుకోవచ్చు కానీ థియేటర్లను తగలబెడతామని హెచ్చరించే అధికారం ఎవరికీ లేదు. కన్నడ ప్రజలకు కమల్‌హాసన్ మాటలను ఖండించే స్వేచ్ఛ ఉంది. అదే సమయంలో ప్రాథమిక హక్కులకు కూడా కాపాడాల్సిన బాధ్యత ఉంది. సెన్సార్ బోర్డు సర్టిఫై చేసిన తర్వాత సినిమాను విడుదల చేయాల్సిందే. దానిని చూడాలా? వద్దా? అనే నిర్ణయాన్ని తీసుకునే అధికారం ప్రజలకు ఉంటుంది.' అని సుప్రీంకోర్టు పేర్కొంది.



## జోరు ఇప్పట్లో ఆగేలా లేదుగా...

ఈ ఏడాది ప్రారంభంలోనే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో సూపర్ హిట్ అందుకుంది మీనాక్షి చౌదరి. గతేడాది సైతం లక్కీ భాస్కర్ సినిమాతో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు తన సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద హిట్టవ్వడం ఖాయమని టాక్. ఇక ఇప్పుడు తెలుగుతోపాటు తమిళంలోనూ ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్స్ వస్తున్నాయి. తాజాగా ఈ అమ్మడు నెట్టింట గ్లామర్ ఫోటోష్ షేర్ చేస్తూ అభిమానులకు షాకిస్తుంది. ఇటీవల వైట్ డ్రెస్ లో గ్లామర్ లుక్స్ తో నెట్టింట అరాచకం సృష్టించిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన అందమైన ఫోటోస్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం నాగచైతన్యకు జోడిగా ఓ సినిమాలో నటిస్తుంది మీనాక్షి. భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే నవీన్ పొలిశెట్టి సరసన అనగనగ ఒక రాజు చిత్రంలోనూ ఈ అమ్మడు నటిస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరో రెండు సినిమాలకు కమిట్ అయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో రెండు సినిమాలు.. వచ్చే సంవత్సరంలో మరిన్ని సినిమాలు విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ రెండేళ్లు వరుసగా హిట్స్ అందుకోవాలని చూస్తోంది మీనాక్షి. అటు తమిళంలోనూ ఆఫర్స్ వస్తున్నట్లు సమాచారం.



## అలరించే అందాల భామ..

సీరియల్స్ లో నటించి ఆతర్వాత బిగ్ బాస్ గేమ్ షోతో విపరీతమైన ఫాలోయింగ్ సొంతం చేసుకున్న భామల్లో శ్రీ సత్య ఒకరు. ముద్ద మందారం, నిన్నే పెళ్లాడతా, అత్తారింట్లో అక్కా చెల్లెళ్లు, మరియు త్రినయని సీరియల్స్‌తో బుల్లితెర ప్రేక్షకులకు బాగా చేరువైంది నటి శ్రీసత్య. విజయవాడలో పుట్టి పెరిగిన ఈ ముద్దుగుమ్మ మొదట మోడలింగ్‌లో అదృష్టం పరీక్షించుకుంది. Ms. AP టైటిల్‌ను కూడా గెల్చుకుంది. ఆతర్వాత నటనపై మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కాగా 2017లో రామ్ పోతినేని హీరోగా నటించిన నేను శైలజ సినిమాలో ఒక చిన్న పాత్ర పోషించింది శ్రీ సత్య. గోదారి నవ్వింది, లవ్ స్కెచ్ సినిమాల్లోనూ కనిపించింది. ఈక్రమంలోనే సీరియల్స్‌లోకి అడుగుపెట్టింది. ఇక బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా అడుగుపెట్టిన ఆమె తన ఆటతో, అందంతో ఆకట్టుకుంది. తాజాగా కాకమ్మ కథలు సీజన్ 2లో పాల్గొంది. ఈ షోలో శ్రీసత్య ఆసక్తికర కామెంట్స్ చేసింది. అలాగే తన జీవితంలో జరిగిన విషాదం గురించి చెప్పింది.. శ్రీ సత్య మాట్లాడుతూ.. నేను ఇంట్లో పట్టించుకోనూ.. నాకు ఫుడ్ పెట్టారా తిన్నన్నా అనేది మాత్రమే చూసుకుంటా.. కనీసం ఇంట్లో ఎవరైనా తిన్నారా అనేది కూడా చూడను.. బేసిక్ గా నాకు ప్రేమ అంటే చాలా ఇష్టం.. ప్రేమకోసం తపించేదాన్ని.. దానివల్లే ఇంట్లో పరిస్థితులు మారిపోయాయి.. మా అమ్మకు పక్షవాతం వచ్చింది.. అప్పటి నుంచి ఆమె అదే పరిస్థితిలో ఉన్నారు మా అమ్మ. ఒక లవ్ కోసం నేను చెయ్యి కోసుకున్నా.. బ్రేకప్ వల్ల నేను రూమ్ లో నుంచి బయటకురాలేదు.. అది మా అమ్మగారి మీద ఎక్కువ ఎఫెక్ట్ చూపించింది. దాన్ని మా అమ్మ తీసుకోలేకపోయింది. నేను బ్రేకప్ వల్ల అంత బాధపడటం చూసి బీపీ ఎక్కువైపోయి అమ్మకి బ్రెయిన్ డిస్టర్బ్ అయ్యింది. 99 పర్సెంట్ అమ్మ బతకదని చెప్పేశారు. నేను ఒక్కదాన్నే మా నాన్నకు షుగర్. నాకు తోడుగా ఎవ్వరూ లేరు.. నేను ఒక్కదాన్నే ఆసుపత్రిలో 30 రోజులు ఉన్నాను. అప్పుడు అర్థమైంది నాకు అసలైన బాధ్యత అంటే ఏంటో.. అని చెప్పుకొచ్చింది.

## చిరు 157వ మూవీపై క్రేజీ అప్‌డేట్..



మెగాస్టార్ చిరంజీవి స్పీడ్ పెంచారు. ఒక సినిమా అయిన వెంటనే మరో సినిమాని సెట్స్ పైకి తీసుకెళుతున్నారు. చిరంజీవి నటించిన విశ్వంభర చిత్రం గత కొద్ది రోజులుగా షూటింగ్ జరుపుకుంటూనే ఉంది. ఈ సినిమాకి సంబంధించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే ఇటీవల మొదలైన అనిల్ రావిపూడి సినిమా మాత్రం పరుగులు పెడుతోంది. ఇక ఈసినిమా స్టార్ట్ అయిన అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తూనే ఉంది.. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందనుందని అంటున్నారు.

ఇక ఈ చిత్రంలో చిరంజీవి డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారనే వార్త కూడా వైరల్ అయింది. రెండు పాత్రలలో ఒక పాత్ర వింటేజ్ చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటుందని, మరో పాత్ర ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉంటుందనే టాక్ అయితే నడిచింది. దీనిపై మూవీ టీమ్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. మెగా 157 వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీ చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ముస్సోరిలోని సుందరమైన ప్రదేశాలలో రెండవ షెడ్యూల్ జరుగుతోంది. ప్రస్తుతంలో ముస్సోరిలో చిరంజీవి, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారట అనీల్ రావిపూడి. తాజాగా సెట్‌లో నయనతార అడుగుపెట్టింది. అక్కడ హీరోహీరోయిన్లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారని సమాచారం. అలానే ఓ స్పెషల్ సాంగ్ కూడా చిత్రీకరించనున్నారట. మెగా 157 చిత్రంలో చిరంజీవి పేరు శివ శంకర్ వర ప్రసాద్‌గా ప్లాన్ చేశారు దర్శకుడు అనిల్.

ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం చిత్రం సక్సెస్‌తో మంచి జోరు మీదున్న అనిల్ రావిపూడి అదే కిక్‌తో చిరు కోసం కథ రెడీ చేశారు. ఈ సినిమాతో ఎలాగైన సూపర్ హిట్ కొట్టాలని కసితో పని చేస్తున్నాడు. కాగా, చిరంజీవి గత సినిమాలన్నీ యాక్షన్ డ్రామాలు కాగా, ఈసారి ప్యూర్ కామెడీ ఎంటర్‌టైనర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ తో పాటు, కామన్ ఆడియన్స్ కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మెగా 157 సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, అద్భుతమైన బాణీలు రూపొందిస్తున్నట్టు తెలుస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com